గురు వారం
27-04-2023
సంపుటి - 08,
సంచిక - 306
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## త్వరలో.. టి.కాంగ్రెస్‌కు చల్లమల్ల కృష్ణారెడ్డి బ్రేకప్

# కారు పార్టీకి !? జంప్







### గతంలో కాంగ్రెస్‌కు రాజగోపాల్‌రెడ్డి వెన్నుపోటు, అదే దారిలో చల్లమల్ల

### మునుగోడు కాంగ్రెస్‌కు తూట్లు పొడిచే కుట్ర !


**హైదరాబాద్ డెస్క్ , ఏప్రిల్ 26 :** రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిలర్ అంటూ విమర్శలు గుప్పిస్తున్న వేళ, కాంగ్రెస్ పార్టీలో ముసలం మొదలైంది. ఓ దిక్కు ఢిల్లీ అధిష్టానం రేవంత్ రెడ్డిపై ఫోకస్ పెట్టింది. రేవంత్ కారణంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్‌లు పార్టీని వీడి వెళ్లిపోతుండటం, ఉత్తమ్ పై దుష్ప్రచారం చెయ్యటం, పొమ్మనలేక పొగపెడుతూ అనేక ఆటంకాలు పెడుతుండటంతో నేరుగా ప్రియాంకా గాంధి ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలో పిసీసీకి ఉన్న విశేష అధికారాలను కుదించి కొన్ని సంచలనాత్మక నిర్ణయాలు తీసుకోబో తున్నారు. ఇవన్ని గ్రహించిన రేవంత్ సహచర బృందంలోని ఒకరైన చల్లమల్ల కృష్ణారెడ్డి తన దారి తాను చూసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇటీవల అధికార మహిళా మంత్రితో బీఆర్ఎస్ అధినేతకు తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచినట్లు తెలుస్తుంది. కాని గులాబీ బాస్ తనయుడు అంత సుముగత చూపకపోవడంతో ఎన్నికల సమయానికి ఆలోచించే యోచనలో ఉన్నట్లు సమాచారం. రాబోయే రోజుల్లో మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్‌లో రాజకీ యాలు మార్పులు చెందే అవకాశం ఉంది. గతంలో రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి బీజేపీలోకి వెళ్ళినట్లు, ప్రస్తుతం ఎన్నికలు రాకున్నా కూడా ముందస్తుగా కాంగ్రెస్ క్యాడర్‌ను చీల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మునుగోడు నియోజక వర్గంలోని కాంగ్రె స్‌లో ఇప్పటికే గ్రూపు రాజకీయాలకు తెరలేపిన చల్లమల్ల కృష్ణారెడ్డి ఓ వర్గాన్ని తన వైపు తిప్పుకోవాలని విశ్వప్రయ త్నాలు చేస్తున్నారు. తన కొరకు ఓ వర్గం బలోపేతం చేసుకొని త్వరలో బీఆర్ఎస్ పార్టీలోకి ఆసక్తి చూపుతు న్నారని పొలిటికల్ సర్కిల్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

రాష్ట్రవ్యాపితంగా టి.కాంగ్రె స్‌లో ఏర్పాటు చేస్తున్న నూతన కమిటీలతో పాటు, ఇప్పటికే చల్లమల్ల ఆధ్వ ర్యంలో మునుగోడు నియో జకవర్గ కమిటీలను ఏర్పా టు చేశారు. తాను వేసిన కమిటీలను రద్దు చేసి కొత్త కమిటీలు వేసేందుకు సన్నహా లు జరుతున్నాయి. చల్లమల్ల ఏర్పా టు చేసిన కమిటీల రద్దు తరువాత చల్ల మల్లకు, తన వర్గం కార్యకర్తలలో స్థైర్యం కోల్పోవడమే కాకుండా, చల్లమల్ల సామ ర్థ్యాన్ని శంకించే అవకాశాలు లేకపోలేదు. అయితే మునుగోడు నియోజక వర్గ కమిటీలు రద్దయ్యే సమాచారం తెలిసిన నుంచి చల్ల మల్లలో ఆందోళన మొదలైంది. ఈ దశలో చల్లమల్ల ఆలోచనలో పడ్డారు. ఇటీవల రేవం త్ కొత్త పార్టీ పెడుతున్నాడనే పుకారులు పొలిటికల్ సర్కిల్‌లో చక్కర్లు కొట్టాయి. ఆ పుకారులే నిజమయ్యే ఛాన్స్ లేకపోవడంతో రేవంత్ కొత్త పార్టీ పెడితే కష్టాలు తప్పవని భావించిన చల్లమల్ల కృష్ణారెడ్డి ముంద స్తుగా తన వ్యవహారాన్ని చక్కదిద్దుకోవాలని బీఆర్ ఎస్ మహిళా మంత్రితో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం.

### మహిళా మంత్రితో మంతనాలు

*తెలంగాణ టి.కాంగ్రెస్‌లో రేవంత్ తీరుపై ఢిల్లీ అధిష్టానం అసం తృప్తిగా ఉంది. ఈ నేపథ్యంలో త్వరలో పీసిసికి ఉండాల్సి విశేష అధికారాలను కుదించే అవకాశం ఉండటంతో రేవంత్‌లో కలవ రం మొదలైంది. టీ.కాంగ్రెస్‌లో రేవంత్‌పై అసంతృప్తి కారణంగా తన అనుచరులు హ్యాండిచ్చేందుకు సిద్ధమౌతున్నట్లు తెలు స్తుంది. ఇప్పటికే అధికార పార్టీ మహిళా మంత్రితో మంతనాలు జరిపినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో రాజగో పాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌ను అయోమ యానికి గురి చేసిన తరువాత చల్లమల్ల రూపంలో మరో మారు పునరావృతం అవ్వబోతుంది. ఈ క్రమంలో మునుగోడు నికార్సైన కాంగ్రెస్ కార్యకర్తలలో ఆనందం చిగురిస్తుంది.*

# 30న సచివాయల ప్రారంభం



- కెసిఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- బిఆర్కె భవన్ నుంచి ఫైళ్లు, కంప్యూటర్ల తరలింపు
- స్వయంగా పర్యవేక్షించిన సిఎస్ శాంతికుమారి
- తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిర్మాణం: మంత్రి వేముల

**హైదరాబాద్,ఏప్రిల్26(సమసమాజం):** తెలంగాణ కొత్త సచివాలయం ఈ నెల 30న ప్రారంభం కానుం డడంతో సచివాయానికి శాఖల తరలింపు ప్రారంభం అయ్యింది. బుధవారం బిఆర్కె భవన్ నుంచి ఆయా శాఖల ఫైళ్లు, కంప్యూటర్ల తరలింపు మొదల య్యింది. అంతుకుముందు సిఎస్ శాంతి కుమారి సచివాయానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఆయా శాఖలకు కేటాయించిన కార్యాలయాలను పరిశీలించారు. సచివాలయం ఈ నెల 30న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం కానున్నది. ఆ రోజు నుంచే కొత్త సచివాలయంలో పాలన సాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని శాఖలు తమకు కేటాయించిన గదులకు సామగ్రిని బుధవారం నుంచి శుక్రవారం వరకు తరలించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. షిఫ్టింగ్ చేయాల్సిన సమయాన్ని కూడా అధికారులు నిర్ధారించారు. ఒక్కో అంతస్తులో మూడు శాఖల కార్యాలయాలు ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఫైళ్లు, కంప్యూటర్లు, జిరాక్స్ మిషన్లు తదితర వాటిని జాగ్రత్తగా తరలించాలని, ముఖ్యమైన ఫైళ్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉమ్మడి ఎపిలో గతంలో విసిరేసినట్లుగా ఉన్న సచివాలయాన్ని అదే ప్రాంతంలో కొత్తగా అధునాతనంగా నిర్మించారు. హుస్సేన్ సాగర్ తీరాన ధవళకాంతులతో తెలంగాణ ఠీవికి దర్పణంలా నిలుస్తున్నది. హిందూ, దక్కనీ, కాకతీయ శైలుల మేళవింపుతో నిర్మాణాలు చేపట్టారు. ఈ నెల 30న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం కానున్నది. సీఎం కేసీఆర్ జూన్ 27, 2019న కొత్త సచివాలయానికి శంకుస్థాపన 2వ పేజీలో...

# ఢిల్లీ మేయర్‌గా షెల్లీ ఒబెరాయ్

## డిప్యూటీ మేయర్‌గా ఆలీ మహమ్మద్ ఇక్బాల్

- పోటీనుంచి తప్పుకున్న బిజెపి అభ్యర్థులు
- ఆప్ అభ్యర్థుల ఏకగ్రీవ ఎన్నిక
- అభినందనలు తెలిపిన సిఎం కేజ్రీవాల్



**న్యూఢిల్లీ,ఏప్రిల్26(సమసమాజం):** ఢిల్లీ మేయర్ ఎన్నిక ఏకగ్రీవం అయింది. బీజేపీ అభ్యర్థి శిఖా రాయ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన షెల్లీ ఒబెరాయ్ ఢిల్లీ మేయర్‌గా తిరిగి ఎన్నికయ్యారు. మేయర్ ఎన్నికకు తగినంత బలం లేకపోవడంతో బీజేపీ వెనక్కి తగ్గింది. ఇక డిప్యూటీ మేయర్ ఎన్నిక కూడా ఏకగ్రీవం అయ్యింది. ఆప్ అభ్యర్థి ఆలీ మహమ్మద్ ఇక్బాల్ డిప్యూటీ మేయర్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంసీడీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఎన్నికలో వీరు ఏకగ్రీవం అయ్యారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి షిఖా రాయ్ బుధవారంనాడు తన నామినేషన్ ఉపసంహరించుకోవడంతో ఢిల్లీ మేయర్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో షెల్లీ ఒబెరాయ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. డిప్యూటీ మేయర్ ఎన్నిక నుంచి కూడా బీజేపీ తప్పుకుంది. ఢిల్లీ మేయర్, డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన షెల్లీ ఒబెరాయ్, మహమ్మద్ ఇక్బాల్‌లను సీఎం అరవింద్ కేజ్రివాల్ అభినందించారు. ప్రజలకు ఆప్‌పై ఎన్నో అంచనాలు ఉన్నాయని, వారి అంచనాలను నెరవేర్చేందుకు కష్టపడి పనిచేద్దామంటూ కేజ్రివాల్ ట్వీట్ చేశారు. ఢిల్లీ మేయర్ ఎన్నిక రొటేషనల్ పద్ధతిలో ఐదు సింగిల్ ఇయర్స్ టర్మ్‌తో ఉంటుంది. తొలి సంవత్సరం మహిళలకు రిజర్వ్ చేయగా, రెండో సంవత్సరం ఓపెన్ కేటగిరిగా, మూడు సంవత్సరం రిజర్వ్‌డ్ కేటగిరిగా, తక్కిన రెండేళ్లు ఓపెన్ కేటగిరిగా ఉంది. ఆర్థిక 2వ పేజీలో...

# రైతులు చస్తుంటే రాజకీయ సభలా !

### మండిపడ్డ రేవంత్



**హైదరాబాద్,ఏప్రిల్26(సమసమాజం):**సీఎం కేసీఆ ర్, మంత్రి కేటీఆర్‌లపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ట్విటర్ వేదికగా విరుచుకుపడ్డారు. అకాల వర్షాలతో కల్లాల్లో ధాన్యం తడిసి రైతులు కన్నీరు మున్నీరుగా ఏడుస్తుంటే.. అయ్య ఔరంగాబాద్‌లో.. కొడుకు ప్లీనరీల పేరుతో.. రాజకీయ సభలు పెట్టుకుని ఊరేగుతు న్నారని విమర్శించారు. వీళ్లకు మానవత్వం ఉందా? అని రేవంత్ 3వ పేజీలో...

# ప్రకాశ్ సింగ్ బాదల్‌కు ప్రధాని మోడీ నివాళి

### ఆయనతో అనుబంధం ప్రత్యేకమని వెల్లడి



**న్యూఢిల్లీ,ఏప్రిల్26(సమసమాజం):** పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీ దళ్ అగ్రనేత ప్రకాశ్‌సింగ్ బాదల్ (95) భౌతికదేహానికి ప్రధాని మోడీ నివాళులు అర్పించారు. ఢిల్లీ నుంచి చండీగఢ్‌లోని శిరోమణి అకాలీదళ్ (ఎస్ఎడి) పార్టీ కార్యాలయానికి చేరుకున్న ప్రధాని ఆయనకు నివాళులర్పించారు. ప్రకాష్ సింగ్ బాదల్ మృతి చెందడం తనకు వ్యక్తిగతంగా తీరని లోటని ప్రధాని అన్నారు. తాను ఆయనతో చాలా దశాబ్దాలుగా సన్నిహితంగా ఉన్నానని ఆయన నుంచి చాలా నేర్చుకున్నానని మోడీ అన్నారు. ఐదుసార్లు పంజాబ్ 2వ పేజీలో...

# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు అండ

కెసిఆర్ ప్రభుత్వం ఆదుకుంటుందన్న కెటిఆర్ ● సిరిసిల్ల జిల్లా నష్టంపై అధికారులతో ఆరా



**హైదరాబాద్,ఏప్రిల్26(సమసమాజం):** రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం అండ గా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే. తారకరామారావు తెలిపారు. రాష్ట్రంలోని రైతులు ఆందోళన చెందవద్దని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని కేటీఆర్ తెలిపారు.దురదృష్ట వశాత్తు రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వలన రైతులకు ఎదురవుతున్న ఇబ్బం దుల పట్ల ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కష్టకాలంలో రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులంతా రైతులకు భరోసా ఇవ్వాలన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రతినిధులంతా క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక అధికారులతో సమన్వయం చేసు కుంటూ పరిస్థితులను పర్యవేక్షించాలని కోరారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. రైతుల విషయంలో అత్యంత సానుకూలంగా ఉండే ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని చెప్పారు. రైతులు ధైర్యం కోల్పోవద్దని, వారికి అండగా సీఎం కేసీఆర్ ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. రానున్న ఒకటి, రెండు రోజులపాటు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో అధికారులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని అధికార యంత్రంగానికి మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.మంగళవారం సాయం త్రం నుంచి కురుస్తున్న అకాల వర్షాలపై మంత్రి కేటీఆర్ సిరిసిల్ల జిల్లా అధికారులతో 2వ పేజీలో...

# పేపర్ లీకేజీని సిట్‌తో సరిపెట్టాలనుకున్నారు

- సిబిఐ విచారణ చేస్తే నిజాలు వెల్లడవుతాయి
- టిసేవ్ ఆందోళనలో వైఎస్ షర్మిల డిమాండ్
- కెసిఆర్‌కు రోజులు దగ్గరపడ్డాయన్న గద్దర్



**హైదారబాద్,ఏప్రిల్26(సమసమాజం):** టీసేవ్ నిరుద్యోగ నిరాహార దీక్ష ఆపాలని ప్రయత్నంలో భాగంగానే తనను అరెస్ట్ చేశారని వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల అన్నారు. ఒక్క మహిళను అడ్డుకోవడానికి మొత్తం పోలీస్ ఫోర్స్ దిగారని మండిపడ్డారు. ఇందిరాపార్క్ వద్ద టీ సేవ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ నిరాహార దీక్షలో షర్మిల పాల్గొని ప్రసంగించారు. టీసేవ్ దీక్షకు అనుమతి ఇవ్వకపోవడంతో కోర్టుకు వెళ్లి అనుమతి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయినా దీక్షను ఆపాలని ప్రయత్నాలు చేశారని.. అందుకే తనను అరెస్ట్ చేశారన్నారు. సిట్ ఆఫీస్‌కు వెళ్తుంటే రసాభాస చేశారన్నారు. పథకం ప్రకారమే అడ్డుకు న్నారని ఆరోపించారు. నేను పోరాటం చేస్తున్నది నిరుద్యోగుల కోసం. తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాల కోసం పోరాటం చేస్తున్నానని తెలిపారు. ప్రతిపక్షాలు నోరు మూసుకొని కూర్చుంటే ప్రజల పక్షాన నిలబడాలని పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. 2వ పేజీలో...

# మరోమారు మావోల పంజా

### మినీ బస్సుపై బాంబిదాడిలో 11మంది జవాన్ల మృతి



**రాయ్‌పూర్,ఏప్రిల్26(సమసమాజం):** ఛత్తీస్‌గడ్ లో మావోయిస్టులు మరోసారి పంజా విసిరారు. అదును చూసి భద్రతాబలగాలపై దాడులకు దిగిన మావోయిస్టు÷-లు మరో ఘాతుకానికి పాల్పడ్డారు. దంతేవాడలోని అరన్ పూర్ ప్రాంతంలో జవాన్లు ప్రయాణిస్తున్న మినీ బస్సును ఐఈడీ మందు పాతర పెట్టి పేల్చేశారు. ఈ ఘటనలో 11 మంది జవాన్లు అక్కడికక్కడే మృతి చెందారు. మరణించిన జవాన్లను డిఫెన్స్ రీసెర్చ్ కు టీంకు చెందిన వారిగా గుర్తించారు ఆర్మీ అధికారులు. మృతుల్లో 10 మంది డీఆర్జీ జవాన్లు, 1 డ్రైవర్ ఉన్నట్లు అధికారికంగా వెల్లడించారు. అరన్ పూర్ లో మవోయిస్టుల ఉనికి ఉందన్న పక్కా సమాచారంతో డీఆర్జీ బృదం.. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టింది. జవాన్లు పహారా ముంగించుకుని తిరిగి తమ కార్యాలయానికి వెళ్తున్న సమయంలో మావోయిస్టులు మందుపాతరతో మినీ బస్సును పేల్చేశారు.

## సంపాదకీయం

# సమగ్ర పంటల బీమా అవసరాన్ని గుర్తించాలి !

పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షంతో అన్నదాతల నెత్తిన పిడుగుపడింది. పెట్టిన పెట్టుబ డులు వర్షార్పణం అయ్యాయి. పంటలు వస్తే అప్పులు తీర్చి..మళ్లీ కొత్త పంటలు వేద్దామన్న ఆలోచనతో సాగుతున్న తరుణంలో గాలివాన దొంగదెబ్బతీసింది. ఈ నెలలోనే వరుసగా రెండుమూడు సార్లు కురిసిన అకాల వర్షాలు రైతులను కోలుకోకుండా చేశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. భారీ వర్షంతో రాష్ట్రం అతలాకుతలం అయింది. ఈదురు గాలులు, కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. వడగండ్ల వానలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చిన పంటలు నాశనం అయ్యాయని ఆందోళన లకు గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట.. చేతికొచ్చే సమయంలో నీళ్లపాలవుతుండంపై అన్నదాతలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ సమయంలోనే ప్రభుత్వం పెద్ద మనసు చేసుకోవాలి. ఉదారంగా సాయం ప్రకటించాలి. నష్టాల అంచనాలతో కాలక్షేపం చేయకుండా... కాలయాపన జరక్కుండా అధికార యంత్రాంగాన్ని రంగంలోకి దింపాలి. జిల్లాల వారీగా పంటనష్టాలను తక్షణం లెక్కలు వేయాలి. గ్రామాల వారీగా పంట నష్టాలను గుర్తించాలి. రైతులకు భరోసా ఇవ్వాలి. అధైర్య పడకుండా చూడాలి. సమీక్షలతో కాకుండా చేయూతతో వారిని అక్కున చేర్చుకోవాలి. నిజానికి వారి రెక్కల కష్టం వరుణుడి ప్రకోపానికి వర్షార్పణం అయింది. ఏ రైతును కదిలించినా కన్నీళ్ళే వస్తున్నాయి.. అప్పటిదాక పంటను చూసుకొని మురిసిపోయిన రైతును.. ఉప్పెనగా విరుచుకుపడ్డ వడగాళ్ల వాన కోలుకోకుండా చేసింది. కళ్ల ముందే ధాన్యం కొట్టుకుపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయుడిగా నిలిచిపోయాడు. నోటికాడికి వచ్చిన పంట... చేతికి రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. పంట చేతికొచ్చే దశలో వడగండ్లు కురిసి నష్టాన్ని మిగిల్చింది. మొక్కజొన్న, వరి, మామిడి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలుచోట్ల ఉరుములు, మెరుపు లతో కూడిన వర్షం పడుతోంది. దీంతో వరి,మామిడి పంటలకు తవ్రనష్టం కల్గింది. గాలి దుమారానికి మామిడి పంట నేలరాలడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మరికొన్ని చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోకి వరద నీరు చేరడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి బస్తాలు తడవడంతో కన్నీటి పర్యంతం అవుతు న్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మంగళవారం కురిసిన అకాల వర్షం అన్నదాతను ఆగం జేసింది. పలుచోట్ల వడగండ్లు కురవడంతో చేతికొచ్చిన పంట నేలరాలింది. ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. భారీ చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. ఆరబెట్టిన ధాన్యం వర్షపు నీటికి కొట్టుకు పోయింది. వడ్ల కుప్పలపై టార్పాలిన్లు కప్పినా ఈదురు గాలులకు ఎగిరిపోయి ధాన్యం తడిసిపోయింది. రైతు పుట్టి ముంచిన అకాల వర్షాలు.. పంటలన్నీ వర్షార్పణం కావడంతో బోరున విలపిస్తున్న కర్షకుల కన్నీరు తుడవాలి. వేలాది ఎకరాల్లో కోట్లాది విలువ చేసే పంటలు దెబ్బతిన్నాయి. వరి ధాన్యం కొట్టుకు పోయింది. మామిడి నేలరాలింది. అరటి పంటలు ధ్వంసం అయ్యాయి. కూరగాయ పంటలు నేలపాలయ్యాయి. ఇలా ఒక్కో రైతుది ఒక్కో దీనగాథలా ఉంది. అకాల వర్షాలు రాష్ట్రవ్యాప్తంగా రైతన్నలు నిలువునా ముంచేశాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకుందామనే ఆశతో ఎదురు చూసిన అన్నదాతను వడగళ్లు, ఈదురు గాలులు కోలుకోలేని దెబ్బతీశాయి. ఒక్కసారిగా విరుచుకుపడ్డ వర్షాలు చేతికందాల్సిన పంటను నేలపాలు చేశాయి. ఎన్నో కష్ట నష్టాలకు ఎదురొడ్డి పండించిన పంటను అకాల వర్షం తుడిచిపెట్టుకు పోతుంటే చేష్టలుడిగి చూస్తుండి పోయాడు. తెలంగాణలో ఇటీవలే దెబ్బతిన్న పంటలను సిఎం కెసిఆర్ పరిశీలించారు. కేంద్రం ఇచ్చే సాయం కోసం ఎదురుచూడకుండా ఎకరాకు పదివేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆ సాయమే ఇంతవరకు అందలేదు. ఈ క్రమంలో ఇంకా ఆలస్యం చేయకుండా వెంలనే అధికారులను పురమాయించాలి. వారికి అండగా ఉండేలా సాయం ప్రకటించాలి. కేంద్రం కూడా ఉదారంగా సాయం అందించాలి. అవసరమైతే నష్టపోయిన రైతుల జాబితా తెప్పించుకుని నేరుగా వారికి పంటనష్ట పరిహారం చెల్లించాలి. ఇందుకోసం ఎంత ఖర్చుయినా వెనకడకుండా..అవసరమైతే రైతులకు ఉన్న బ్యాంక్ రుణాలను కూడా మాఫీ చేయాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర నష్టం జరిగింది. దీనిపై రాష్ట్రాలు, కేంద్రం కలసి తోణం ఆదుకునే ప్రయత్నాలు చేయాలి. నిజానికి విపత్తు సాయం కింద కొంత నిధిని కేంద్ర,రాష్ట్రాలు కలపి ఏర్పాటు చేస్తే బాగుండేది. ఎక్కడ ఎప్పుడు ఎలాంటి విపత్తు కలిగినా ఆదుకునేలా ప్రత్యేక యంత్రాంగం ఉండాలి. ప్రత్యేక నిధులు ఉండాలి. ఈ నిధులను తటణం రైతులకు అందించేలా చూడాలి. అలాగే సమగ్ర పంటల బీమా అన్నది దేశానికంతటికీ ఒకేలా ఉండేలా చొరవ తీసుకోవాలి. బీమా కంపెనీలు తక్షణం నష్టం అంచనావేసి పంట నష్టాన్ని అందించాల చూడాలి. రైతుల సంక్షేమం గురించి ఉపన్యాసాలు ఇస్తున్న పాలకులు ఇప్పుడు ఈ సమస్యలపై దృష్టి సారించాలి. కార్యాచరణ సిద్ధం చేయాలి. దేశంలో ఉన్న ఇనస్ఊరెన్స్ కంపెనీలతో చర్చించి సమగ్ర పంటలబీమా పథకం రచించాలి. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వాలతో ప్రమేయం లేకుండా సాయం అందేలా చ ఉడాలి. అప్పుడే రైతులకు భరోసా దక్కగలదు.

# మళ్లీ మోసం చేసేందుకు వస్తున్న బాబు

- నరమాంసం మరిగిన పులిలాంటోడు
- దాచుకో..దోచుకో..తినుకో ఇదే బాబు లక్ష్యం
- అనంత వేదికగా మారోమారు బాబుపై జగన్ విమర్శలు



**అనంతపురం,ఏప్రిల్26(సమసమాజం):** మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు పాత డైలాగులు చెపుతున్నారని నార్పల సభలో సిఎం జగన్ విరుచుకుపడ్డారు. పులి కథ చెప్పి బాబుపై సెటైర్లు వేశారు. నిత్యం రాజకీయాల మధ్య బతుకున్నామంటూ.. నరమాంసం తినే పులి మారిందంటే నమ్ముతారా అని ప్రశ్నించారు. వచ్చీ రాని ఇంగ్లీషుతో జాతీయ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చిన చంద్రబాబు... దోచుకో.. తినుకో..దాచుకో అనే సిద్దాంతాన్ని అవలంబి స్తున్నారని అన్నారు. పంచతంత్ర కథలో ముసలి పులిగా చంద్రబాబును పోల్చారు. చంపి దోచుకున్న నగా నట్రాను పులి జనానికి ఎరవేసిందని నార్పల సభలో చంద్రబాబును ఘాటుగా విమర్శించారు. పులి వచ్చిన వాళ్లను వచ్చినట్టు తినడం నేర్చుకొని... అబద్దాలతో చంద్రబాబు ఇండస్ట్రీని నిర్మించుకున్నారని విమర్శల వర్షం కురిపించారు. రైతులను నట్టేట ముంచి గతంలో అధికారంలోకి వచ్చార్నారు. 2016 నుంచి జీరో వడ్డీ ఎత్తేసిన చంద్రబాబు .. మళ్లీ అబద్దాలతో వస్తే జనం నమ్మాలా అని ప్రశ్నించారు. పంచతంత్ర కథల్లో నీతి నేర్చుకుంటాం. రోజూ రాజకీయాల మధ్య మనం బతుకున్నాం. చంద్రబాబు అధికారంలోకి వచ్చి రైతుల్ని నిండా ముంచారు. అక్కాచెల్లెమ్మల పొదుపు రుణాలు మాఫీ చేస్తానని మోసం చేశారు. బ్యాంకుల్లో పెట్టిన బంగారాన్ని బ్యాంకులు వేలం వేశాయప్పుడు. సున్నా వడ్డ పథకాన్ని రద్దు చేశాడు. నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి.. మొండి చేయి చూపాడు. ఇప్పుడు మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు ప్రజల్లోకి వస్తున్నారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు మరిన్ని అబద్దాలు చెబుతాడు. దోచుకో, పంచుకో.. ఇదే చంద్రబాబు సిద్దాంతం. బాబు అబద్దాలను, మోసాలను నమ్మకండి. జగనన్న వల్ల మంచి జరిగిందా? లేదా? అనేది కొలమానంగా తీసుకోండి.. ఆలోచించండి. మీ జగనన్న నమ్ముకున్నది దేవుడి దయను, ప్రజలను. నా నమ్మకం, నా ఆత్మ విశ్వాసం ప్రజలే అని సీఎం జగన్ ఉద్ఘాటించారు. రాబోయే ఎన్నికల కురుక్షేత్రంలో మీ దీవెనలు నాకు కావాలని జగన్ ప్రజలను కోరారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బుధవారం అనంతపురం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా నార్పలలో జగనన్న వసతి దీవెన పథకం నిధులు విడుదల చేశారు. ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా 9,55,662 మంది విద్యార్థులకు లబ్ది చేకూరుతుంది. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.912 కోట్లు జమ చేశారు. జగనన్న వసతి దీవెన కింద ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున సాయం అందించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ చదువు కోసం ఎవరూ అప్పులపాలు కాకూడదనేదే తమ ఉద్దేశమన్నారు. ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చామని, నాడు-నేడుతో స్కూళ్ల రూపు రేఖలు మార్చేశామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ సభలో సీఎం జగన్.. చంద్రబాబుపై పంచ్‌లు చేశారు.. పనిలో పనిగా పిట్టకథలు చెబుతూ విమర్శలు గుప్పించారు. జాతీయ మీడియాకు ఒక ముసలాయన ఇంటర్వ్యూ ఇచ్చారని, వచ్చీరానీ ఇంగ్లీష్‌తో రిపబ్లిక్ టీవీకి చంద్రబాబు ఇంటర్వ్యూ ఇచ్చారన్నారు. అది చూస్తే తనకు పంచతంత్రం కథలు గుర్తుకొచ్చా యన్నారు. నరమాంసం తినే పులి ఇప్పుడు ముసలిదైందన్నారు. వేటాడే శక్తి లేకనే నాలుగు నక్కలను తోడేసుకుందన్నారు. మనుషులను చంపడం ఎలా అని ప్లాన్ చేసిందని, ఆ పులి అడవిలో తనకు 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెబుతోందన్నారు. పులి ఇప్పుడు తానెవరినీ తినడంలేదని నమ్మిస్తోందని.. నరమాంసం తినే పులి.. మారిందంటే నమ్ముతామా? అని ప్రశ్నించారు. మాయమాటలు చెప్పేవారిని ఎప్పుడూ నమ్మొద్దని, చంద్రబాబుకు ఎప్పుడూ బుద్ధి రాదని, మళ్లీ మోసం చేసేందుకే చంద్రబాబు పాత డైలాగ్‌లు మాట్లాడుతు న్నారని జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# ఢిల్లీ మేయర్‌గా షెల్లీ ఒబెరాయ్

(మొదటి పేజీ తరువాయి) సంవత్సరం ముగిసిన తర్వాత సిటీకి కొత్త మేయర్ వస్తారు. డిసెంబర్ 4న ఎంసీడీ ఎన్నికలు జరగగా, ఆప్ అత్యధిక సీట్లు దక్కించుకుంది. మొత్తం 250 వార్డులు ఉన్న ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 134 చోట్ల ఆ పార్టీ అభ్యర్థులు జెండా ఎగురవేశారు. దాదాపుగా 15 ఏళ్లుగా ఢిల్లీ మున్సిపాలిటీని సొంతం చేసుకున్న బీజేపీ ఈ ఎన్నికల్లో ఓడిపోయింది. మేయర్ ఎన్నికలో షెల్లీ ఒబెరాయ్, షిఖారాయ్ మధ్య ముఖాముఖీ పోటీ ఉంటుందని అందరూ అంచనా వేసినప్పటికీ బీజేపీ నామినేషన్ ఉపసంహరించు కోవడంతో మేయర్ ఎన్నిక ఏకగ్రీవం అయింది.ఒబెరాయ్ ఫిబ్రవరి 22న ఢిల్లీ మేయర్‌గా నాలుగో ప్రయత్నంలో ఎన్నికయ్యారు. దీనికి ముందు మూడు సమావేశాల్లో ఆప్, బీజేపీ మధ్య గందరగోళం తలెత్తింది. నామినేటెడ్ సభ్యులకు ఓటింగ్ హక్కుల వ్యవహారంపై గొడవ జరగడంతో మూడుసార్లు వాయిదా పడి నాలుగోసారి ఎన్నిక జరిగింది. బీజేపీకి చెందిన రేఖా ఖప్తాను షెల్లీ ఒబెరాయ్ 34 ఓట్ల తేడాతో ఓడించారు. మొత్తం పోలైన 266 ఓట్లలో రేఖా గుప్తా 116 ఓట్లు సాధించారు. గత ఏడాది డిసెంబర్ 4న ఎంసీడీ ఎన్నికలు జరగగా, ఆప్ విజయకేతనం ఎగురవేసింది.

# నిరుద్యోగ మార్చ్‌తో జోరు

## అధికార పార్టీ లక్ష్యంగా విమర్శలు

**హైదరాబాద్,ఏప్రిల్26(సమసమాజం):** రాష్ట్రంలో రాజకీయాలు రోజురోజుకు వేడీ రాజుకుంటున్నాయి. తెరాస, భాజపా, కాంగ్రెస్‌లు పరస్పర విమర్శ బాణాలు ఎక్కుపెడుతున్నారు. ముఖ్యంగా తెరాస-భాజపా నాయకుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గమనేలా రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అధికార గులాబీ పార్టీపై కాషాయం నిప్పులు చెరుగుతోంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తాజాగా నిరుద్యోగ మార్చ్‌తో జిల్లాల్లో సభలు పెడుతూ కేసీఆర్ పార్టీపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. తాజాగా పాలమూరులో రెండో యాత్ర ముగిసింది. తొలుత వరంగల్, తరవాత మహబూబ్‌నగర్‌లో జరిగింది. నిరుద్యోగులను మోసం చేశారని, పేపర్లు అమ్ముకున్నారని మండిపడ్డారు. నిరుద్యోగుల ఉసురు తగులుతుందని హెచ్చరిస్తున్నారు. సంక్షేమ పథకాల వైఫల్యం, డబుల్ బెడ్‌రూంలు, నిరుద్యోగ భృతి, ఉద్యోగ నోటిఫికేషన్లు, కాళేశ్వరం నీళ్లు, రైతుల కష్టాలు, ధాన్యం కొనుగోళ్లు.. ఇలా ప్రతి అంశంలో అధికార పార్టీని నిలదీస్తున్నారు పోస్టుల భర్తీ ఎప్పుడంటూ ప్రశ్నించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాలయాపన లేకుండా అన్ని ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వాలన్నారు. ఖాళీల భర్తీని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. మూడున్నరేళ్లలో ఒక్కో నిరుద్యోగికి రూ.1.20 లక్షల భృతి చెల్లించాలని అన్నారు. ఒప్పంద, పొరుగు సేవల సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వం శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న బండి సంజయ్.. కాలయాపన లేకుండా ఉద్యోగాల భర్తీ చేయడంలో విఫలం అయ్యారని విమర్శించారు.



# ప్రకాశ్ సింగ్ బాదల్‌కు ప్రధాని మోడీ నివాళి

(మొదటి పేజీ తరువాయి) ముఖ్యమంత్రిగా పనిచేసిన బాదల్ (95) స్వల్ప అస్వస్థతతో మంగళవారం మొహాలీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు 27 గురువారం ముక్తసర్ జిల్లాలోని అతని స్వస్థలమైన బాదల్‌లో జరుగనున్నాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రకాశ్ సింగ్ బాదల్ 1927, డిసెంబరు 8న పంజాబ్‌లోని అబుల్ ఖురానా గ్రామంలో జన్మించారు. బాదల్ కు కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్, కుమార్తె ప్రణీత్ కౌర్. 30 ఏళ్ల వయసులో 1957లోనే తొలిసారి ప్రకాశ్‌సింగ్ బాదల్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. 43 ఏళ్ల వయసుకే ముఖ్యమంత్రి పదవిని అధిష్ఠించిన పిన్న వయస్కుడిగా ఆయన రికార్డు సృష్టించారు. పంజాబ్ ముఖ్యమంత్రిగా చిన్న వయస్సులో బాధ్యతలు చేపట్టిన వ్యక్తిగానూ రికార్డు సృష్టించారు. చివరిసారిగా బాదల్ 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసి ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి గుర్మీత్ సింగ్ ఖుదియాన్ చేతిలో ఓడిపోయారు. ఆయన రాజకీయ జీవితంలో ఇదే తొలి ఓటమి, ఈవే చివరి ఎన్నికలు కావడం గమనార్హం.

# 30న సచివాయుల ప్రారంభం



(మొదటి పేజీ తరువాయి) చేశారు. సచివాలయంలో తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు అద్దంపట్టే కళాకృతులను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. దేశంలో మరే ఇతర రాష్ట్రం లో లేనివిధంగా ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా ఆధునిక నిర్మాణ పద్ధతులతో భవనాన్ని నిర్మించామని వివరించారు. అత్యాధునిక హంగులతో కూడిన భవన సముదాయాన్ని నాలుగేండ్లలోపే పూర్తిచేసి, ప్రారంభానికి సిద్ధం చేశారు. ఇండో-పర్షియన్ నిర్మాణశైలిలో ఓ చారిత్రక కట్టడం తరహాలో దీనికి డిజైన్ చేశారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ షాపూర్‌జీ పల్లోంజీకి పనులు అప్పగించారు. ఈ భవన సముదాయ నిర్మాణ పనులు మంత్రి ప్రశాంత్‌రెడ్డి పర్యవేక్షణలో అత్యంత వేగంగా పూర్తయ్యాయి. రాష్ట్ర హైకోర్టు తరహాలోనే సచివాలయంపై నిర్మించిన డోమ్‌లు, రెండు డోమ్‌లపై నిర్మించిన జాతీయ చిహ్నాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మొత్తం 34 డోమ్‌లను ఏర్పాటు చేయగా, సచివాలయానికి ముందు, వెనుక భాగాల్లో ఏర్పాటు చేసిన డోమ్‌లు అత్యంత ఎత్తైనవి. సుమారు 165 అడుగుల ఎత్తున ఉన్న డోమ్‌పై జాతీయ చిహ్నాలను ఏర్పాటు చేసారు. ఇందులో నీటి సరఫరా కోసం హైడ్రో న్యుమాటిక్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌ను అత్యవసర సమయాల్లో మాత్రమే ఉపయోగించేలా తగిన ఏర్పాట్లు చేశారు. వర్షపునీటిని స్టోర్ చేసేందుకు సంపును ఏర్పాటు చేశారు. భవనంపై పడిన నీటిచుక్కకూడా వృథాకాకుండా అవి సంపులోకి చేరేలా చేసి జలసంరక్షణ ప్రాధాన్యతకు సచివాలయాన్ని మార్గదర్శిలా తీర్చిదిద్దారు.



చివాలయ ప్రాంగణంలో రెండు భారీ ఫౌంటెయిన్లను ఏర్పాటు చేశారు. 28 అడుగుల ఎత్తు, 58 అడుగుల వెడల్పుతో రెడ్ శాండ్‌స్టోన్‌తో వీటిని నిర్మించారు. నిజామాబాద్‌లోని కాకతీయుల కాలంనాటి నీలకంఠేశ్వర స్వామి ఆలయం, వనపర్తి రాజప్రాసాదాల్లోని శైలుల ఆధారంగా డోమ్‌లను తీర్చిదిద్దారు. గుజరాత్‌లోని సలంగ్‌పూర్ హనుమాన్ దేవాలయ నిర్మాణ శైలిని కూడా గుమ్మటాల్లో వాడారు. బయటివైపు ఆకర్షణీయంగా కనిపించే తాపడాలన్నీ ఎర్ర ఇసుకరాతితో, మధ్యలోని బురుజు రాజస్థాన్‌లోని ధోల్‌పూర్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన ఇసుకరాతితో నిర్మించినట్టు అధికారులు చెప్పారు. ప్రఖ్యాత ఆర్కిటెక్ట్‌లు అయిన డాక్టర్ ఆస్కార్, పొన్ని కాన్సెసావోలు దీని డిజైన్ చేశారు.నూతన సచివాలయాన్ని గ్రీన్ కాన్సెప్ట్ విధానంలో నిర్మించారు. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చే విధంగా డిజైన్ చేశారు. చుట్టూ గదులు, మధ్యలో ఖాళీ స్థలం ఉంచారు. మొత్తం ఎనిమిది ఎకరాల స్థలాన్ని పచ్చదనం కోసం కేటాయించారు. పచ్చికతోపాటు మొక్కలను కూడా నాటారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో గ్రంథాలయాన్ని నిర్మిస్తున్నారు. తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌వైపు 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంటీన్, అదే వరుసలో గుడి, బ్యాంకు, ఏటీఎం ఉంటా యి. సచివాలయ ప్రాంగణంలో రెండున్నర ఎకరాల్లో 560 కార్లు, 720 ద్విచక్ర వాహనాలు, నాలుగు బస్సులకు పార్కింగ్ సౌకర్యం కల్పించారు. సందర్శకులకోసం మరో 300 కార్లు పట్టేలా ఒకటిన్నర ఎకరాల్లో పార్కింగ్‌ను ఏర్పాటుచేశారు. రోజువారీ సందర్శకులు, అధికారులు, ప్రత్యేక సమావేశాల సందర్భంలో వచ్చే వాహనాలను దృష్టిలో ఉంచుకొని ఆ మేరకు సిద్ధం చేశారు. సచివాలయంలోని ఆరో అంతస్థులో సీఎం, చీఫ్ సెక్రటరీల చాంబర్లను ఏర్పాటు చేశారు. వీటితోపాటు సీఎం సిబ్బంది, ఆయన ప్రజలను కలిసేందుకు 'జనహిత' పేరుతో 250 మంది కూర్చునేవిధంగా సమావేశ మందిరం, మంత్రులు, అధికారులకు సరిపడా క్యాబినెట్ సమావేశం కోసం మరో హాలు, సీఎంను కలిసేందుకు వచ్చేవారికోసం ప్రత్యేక వెయిటింగ్ హాలును నిర్మించారు. కలెక్టర్లతో సమావేశాల నిర్వహణకు కూడా ప్రత్యేక సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేశారు. కనీసం 25 మంది విశిష్ట అతిథులతో ముఖ్యమంత్రి కలిసి భోజనం చేసేందుకు ఓ అత్యాధునిక డైనింగ్ హాలును కూడా నిర్మించారు. చివాలయ ప్రధాన ద్వారాన్ని నాలుగు భారీ తలుపులతో ఏర్పాటు చేశారు. తలుపులపై ఇత్తడి పూతతో నగిషీలను కూడా చెక్కించారు. ఆదిలాబాద్ అడవుల్లోని టేకు కలపను ఉపయోగించి నాగ్‌పూర్‌లో వీటిని తయారు చేయించినట్టు అధికారులు చెప్పారు. మొత్తం సచివాలయంలో 875 వరకు తలుపులు ఉండగా, ఇందులో దాదాపు 90 శాతం తలుపులు టేకు కలపతోనే తయారు చేశారు. కొన్ని మాత్రం ఇనుముతో చేయించినట్టు అధికారులు వెల్లడించారు. వనానికి నలువైపులా వెడల్పైన మెట్లదారితోపాటు మూడు, నాలుగు చొప్పున భారీ లిఫ్టులను ఏర్పాటు చేశారు. ఏమైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే కిందకు చేరుకునేలా ఇవి ఎంతో ఉపయోగపడతాయని అధికారులు చెప్తున్నారు. ఫైర్ సేఫ్టీ వ్యవస్థను కూడా పటిష్టంగా ఏర్పాటు చేశారు. షార్ట్ సర్క్యూట్‌తో ఎక్కడా ఎలాంటి అగ్ని ప్రమాదాలకు తావులేకుండా ఉండేందుకు విద్యుత్ సరఫరా వ్యవస్థను ఎక్కడికక్కడ నిలిపివేసేలా తగిన ఏర్పాట్లు చేశారు.

# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు అండ

(మొదటి పేజీ తరువాయి) సమీక్షించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పీ, వ్యవసాయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాలోని పరిస్థితులపై వివరాలు తీసుకున్నారు. అనుకోకుండా కురిసిన ఈ అకాల వర్షాల వలన నష్టపోయిన జిల్లా రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. రైతులు అందోళన చెందవద్దని కోరారు. జిల్లా అధికారులతోపాటు జెడ్పీడీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు ప్రతి ఒక్కరు తమ పరిధిలోని ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి రైతులకు భరోసా ఇవ్వాలని సూచించారు.

# పేపర్ లీకేజీని సిట్‌తో సరిపెట్టాలనుకున్నారు

(మొదటి పేజీ తరువాయి) రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఉందని ఎత్తి చూపింది తానే అని అన్నారు. ఈ ప్రభుత్వానికి మహిళలు అంటే లెక్కే లేదని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి భార్య విజయమ్మకు గౌరవం ఇవ్వకుండా అడ్డుకుంటారా అని ప్రశ్నించారు. వైఎస్ఆర్ హయాంలో పోలీస్ శాఖ ఒక వెలుగు వెలిగిందని.. ఇప్పుడు పోలీసులను కేసీఆర్ పని మనుషులుగా వాడుకుంటున్నారని విమర్శించారు. పోలీస్ శాఖ అంటే గౌరవం ఉందని.. వారిని అవమానపరచడం తన ఉద్దేశ్యం కాదని స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబం మొత్తం స్కాంలతో కూరుకుపోయిందని విమర్శించారు. కేసీఆర్ వాటర్ స్కాం, బిడ్డ లిక్కర్ స్కాం, కొడుకు టీఎస్‌పీఎస్సీ పేపర్ స్కాంకు పాల్పడ్డారని ఆరోపించారు. సిట్‌కు కేవలం రిప్రజెంటేషన్ కోసమే వెళ్ళాలి అనుకున్నామని వివరించారు. ఈ కేసులో కేవలం 19 మందిని మాత్రమే దోషులుగా చిత్రీకరణ చేశారని.. పెద్ద తలకాయలను వదిలేశారని అన్నారు. పాత్రధారులను మాత్రమే పట్టుకున్నారని... సూత్రధారులను వదిలేశారని మండిపడ్డారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్‌లో ఐటీ లోపాలు ఉన్నాయన్నారు. పేపర్ హ్యాక్ అయ్యిందని స్వయంగా చైర్మన్ చెప్పారన్నారు. ఇదేనా ఐటీ శాఖ భద్రత అని ప్రశ్నించారు. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ టీఎస్‌పీఎస్సీకి పారదర్శకత ఉందంటారని.. పేపర్ లీక్ అయ్యేసరికి తనకేం సంబంధం లేదని అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూటు బూటు వేసుకొని విదేశాలు తిరిగితే ఐటీ శాఖ మంత్రి అనరన్నారు. అమెరికాలో ఐటీ ఉద్యోగం చేసిన కేటీఆర్‌కు ఫైర్ వాల్స్ అంటే తెలియదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పరిధిలో వాడుతున్న కంప్యూటర్లకు ఎన్నింటికి భద్రత సర్టిఫికెట్లు ఉన్నాయో బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

# రైతులను నట్టేట ముంచిన జగన్ ప్రభుత్వం

### క్రాప్ ఇన్సూరెన్స్ విస్మరించిన వైసిపి
### టిడిపి అధికారంలోకి వచ్చాక అండగా ఉంటాం
### కర్నూలు జిల్లాలో కొనసాగుతున్న లోకేశ్ పాదయాత్ర



**కర్నూలు,ఏప్రిల్26(సమసమాజం):** క్రాప్ ఇన్సూరెన్స్ విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతులను నట్టేట టిడిపి యువనేత నారా లోకేశ్ విస్మరించారని విమర్శించారు. సొంతంగా ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కంపెనీ పెడుతుందని చెప్పి ఇంత వరకు రిజిస్ట్రేషన్ కూడా చేయించలేదన్నారు. ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందడం లేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో డ్రిప్, ఇన్ పుట్ సబ్సిడీ, పంటనష్టపోతే సకాలంలో క్రాప్ ఇన్సూరెన్స్ అందజేశామని గుర్తుచేశారు. జగన్ ప్రభుత్వ నిర్వాకం కారణంగా పత్తి రైతుపై సగటు రూ.2.5 లక్షల అప్పుతో జాతీయస్థాయిలో మొదటిస్థానంలో ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక అన్నదాతలకు అండగా నిలుస్తామని, నష్టపోయిన రైతాంగానికి ఆదుకుంటామని లోకేష్ భరోసా ఇచ్చారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. గత 80 రోజులుగా ఎంతో ఉత్సాహంగా లోకేష్ పాదయాత్ర చేస్తూ ప్రజల సాదకబాదకాలను వింటున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని సమస్యలు తీర్చుతామని ప్రజలకు అభయమిస్తున్నారు. ఈరోజు 81వ రోజు పాదయాత్రను మంత్రాలయం నియోజకవర్గం కోసిగి విడిది కేంద్రం నుంచి లోకేష్ పాదయాత్రను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా బోపాయి రైతులను లోకేష్ కలిశారు. కోసిగి శివార్లలో మోహన్, శ్రీరామ్ అనే బొప్పాయి రైతులను యువనేత లోకేష్ కలిసి.. వారి కష్టాలను తెలుసుకున్నారు. ల్గ÷తులు మాట్లాడుతూ.. చెరో నాలుగు ఎకరాలు పొట్టి బొప్పాయి వేస్తే, ఒక్కొక్కరికి 8 లక్షలు నష్టం వచ్చిందని తెలిపారు. ఇటీవల ఈదురుగాలులు, అకాల వర్షాలకు చెట్లు దెబ్బతిన్నాయని, కాయలు నేల రాలాయని అన్నారు. అధికారులు వచ్చి పంటను పరిశీలించాలని కోరితే... పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తెండి రాస్తామన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పరిశీలించకుండా నష్టం ఎలా అంచనా వేస్తారని అడిగితే ఇష్టమైతే తాము అడిగిన వివరాలు తెండి, లేకపోతే మానుకోండని ఆర్బీకేలో సమాధానమి చ్చారన్నారు. రెండునెలలైనా ఇంతవరకు ఎవరు పంటను పరిశీలించడానికి రాలేదని చెప్పారు. నీళ్లులేకపోతే పులికనుమ నుంచి 10లక్షలు ఖర్చుపెట్టి 4 కిలోమీటర్లు పైపులు వేసి నీళ్లు తెచ్చుకోవాల్సి వచ్చిందన్నారు. గతంలో ఇరుగుపొరుగు వారు బొప్పాయి వేస్తే లాభాలు వచ్చాయని చెబితే తాము ఈ పంట ఎంచుకున్నామని.. ప్రభుత్వం నుంచి సాయం అందకపోతే వ్యవసాయం చేయలేమని రైతులు తమ బాధను చెప్పుకొచ్చారు. అనంతరం లోకేష్‌ను డి.బెళగల్ గ్రామస్తులు కలిశారు. మంత్రాలయం నియోజకవర్గం డి.బెళగల్ గ్రామస్తులు యువనేత నారా లోకేష్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. తమ గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో పులికనుమ, గురురాఘవేంద్ర ప్రాజెక్టు, బసలదొడ్డి ఎత్తిపోతల ఉన్నాయని తెలిపారు. తమ గ్రామానికి 8 కిలోమీటర్ల దూరంలో తుంగభద్ర నది ఉందని... కానీ తమ గ్రామానికి తాగు, సాగు నీరు అందడం లేదన్నారు. తుంగభద్ర నుంచి ఎత్తిపోతల ద్వారా నీరు అందించాలని కోరారు. డి.బెళగల్ మండలానికి డిగ్రీ కాలేజి ఏర్పాటు చేయాలన్నారు. తమ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని విన్నవించారు. ఉచిత విద్య, వైద్యం, పంటలకు గిట్టుబాటు ధరలు, మంచి విత్తనాలు అందించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం తమ గ్రామ నిధులు రూ.35 లక్షలు లాక్కుందని... వాటిని తిరిగి ఇప్పించాలని కోరారు. నరేగా పథకం పనులకు సంబంధించిన కూలీ సొమ్ము గతంలో సకాలంలో వచ్చేవని... నేడు 3 నెలలైనా రావడం లేదని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. యువనేత నారా లోకేష్ స్పందిస్తూ.... వైసీపీ ప్రజాప్రతినిధులకు దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల కష్టాలు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీపంలో నీటి వనరులున్నా తాగునీరు అందని దుస్థితి కల్పించడం బాధాకరమన్నారు. గురురాఘవేంద్ర, పులికనుమ ప్రాజెక్టులను చేపల పెంపకం కోసం నీళ్లివ్వకుండా రైతుల నోళ్లుగొట్టడం దారుణమని అన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాంతంలో తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేసి 24/7 తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో మాదిరి సబ్సిడీలు, విత్తనాలు అందించి రైతులను ఆదుకుంటామన్నారు. నరేగా పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులు, కూలీలకు సౌలభ్యంగా ఉండేలా చేస్తామని యువనేత హామీ ఇచ్చారు.



# పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం



- ఎకరాకు పదివేలు ఇచ్చి ఆదుకుంటాం
- కేంద్రం కూడా మరో పదివేలు ఇచ్చి ఆదుకోవాలి
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన హరీస్ రావు

**సిద్దిపేట,ఏప్రిల్26(సమసమాజం):**ౖతులకు ఎకరాకు తెలంగాణ ప్రభుత్వం పదివేలు సాయం ప్రకటించిందని, మీకు ఆదుకోవాలని ఉంటే మరో పదివేలు ఇవ్వాలని మంత్రి హరీష్ రావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బిజెపి నేతలు ఈ మేరకు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకి రూ.10వేల చొప్పున నష్టపరిహారం అందిస్తామని, రైతులు ధైర్యంగా ఉండాలని రైతులకు భరోసా కల్పించినట్లు చెప్పారు. పంట నష్టపోయిన ఎకరాకు తెలంగాణ ప్రభుత్వం రూ.10వేలు ఇస్తుందన్నారు. రైతులను ఆదుకోవాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఉంటే మరో రూ.10వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అకాల వర్షాలకు రైతులు పంట నష్టపోవడం దురదృష్టకరమని ఆర్థికమంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్ధిపేట, దుబ్బాక నియోజకవర్గాల పరిధిలో మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంత్రి పరిశీలించారు. పంటలను పరిశీలించి, ఆదుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం దుబ్బాకలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆకస్మికంగా కురిసిన వడగండ్ల వానతో నోటి కాడికి వచ్చిన ముద్ద నేల పాలైనట్లు చేతికాడికి అందిన పంటలను రైతులు కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ఆరుగాలం కష్టపడి రాత్రనక పగలనక రైతులు పడ్డ కష్టానికి ప్రతిఫలం లేకుండాపోయిందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా వడగండ్ల వానతో జిల్లాలో పంటలకు తీవ్రనష్టం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రైతుబిడ్డ, రైతు కష్టాలు తెలిసిన నేతగా పంట నష్టాన్ని పరిశీలించి రైతులను ఆదుకునేందుకు నన్ను ప్రతినిధిగా పంపారన్నారు. జిల్లాలో సిద్ధిపేట, దుబ్బాక నియోజకవర్గాల్లోని 25గ్రామాల్లో తిరిగి పంట నష్టాన్ని పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడన్నారు. జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం గర్వపడేలా పథకాలను సీఎం కేసీఆర్ తీసుకువచ్చారని, యాసంగి కాలంలో తెలంగాణలో సాగయ్యే బాయిల్డ్ రైస్ కేంద్ర ప్రభుత్వం తీసుకోకున్నా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రూ.30వేల కోట్లు ఇవ్వకుండా ఆపిన రైతుల మోటార్లకు కరెంటు మీటర్లు పెట్టలేదన్నారు. రైతుబంధు, రైతు బీమా, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో యాసంగిలో 57 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండిందని తెలిపారు. ఇవన్నీ రైతులపై సీఎం కేసీఆర్ కు ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. నగదు బదిలీ పథకానికి ప్రత్యక్ష నిదర్శనం తెలంగాణ పథకాలని, అవినీతికి ఆస్కారం లేకుండా రాష్ట్రంలో నగదు బదిలీ పథకాలు కొనసాగుతున్నాయన్నారు. అన్నదాతల ఆదాయం పెంచే ప్రయత్నం కేసీఆర్ చేస్తున్నారని, దేశంలో అతి ఎక్కువ ఉత్తమ గ్రామ పంచాయతీల అవార్డులు తెలంగాణకు రావడం ఇక్కడి పరిపాలనకు నిదర్శనమన్నారు. సీఎం కేసీఆర్ రైతుబంధు, మిషన్ కాకతీయ, పెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేయడం కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేయడం ద్వారా వ్యవసాయంగానికి గట్టి పునాదులు వేశారని, ? ఏ గ్రామంలో తిరిగిన సీఎం కేసీఆర్ ప్రభుత్వం పట్ల రైతులలో ప్రేమ అభిమానం కనబడుతున్నదన్నారు. మంత్రి వెంట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యానవన శాఖ అధికారులు ఉన్నారు.

# రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీసేలా బిజెపి



- గుజారాత్‌లో కూడా 24 గంటల కరెంట్ లేదు
- అభివృద్దిలో తెలంగాణతో పోటీ పడలేరు
- మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి,ఏప్రిల్26(సమసమాజం):** రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తోన్న వారికి సరైన సమయంలో బుద్ధి చెబుతామని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ వ్యతిరేకులు ఆది నుంచి కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ పునర్నిర్మాణాన్ని తాము గురుతర బాధ్యతగా భావిస్తున్నామని నిరంజన్ రెడ్డి తేల్చిచెప్పారు. వనపర్తి మండలం అప్పాయపల్లి, అప్పాయపల్లి పరిధిలోని తండాల్లో పల్లెనిద్రలో భాగంగా ఈ ఉదయం మార్నింగ్ వాక్ లో పర్యటించిన రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. ఆది నుంచి తెలంగాణకు అడ్డుపడి, కించపరిచే వాళ్ళు ఏ పార్టీలో ఉన్నా అదే రీతిని అవలంబిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. తెలంగాణతో పోల్చితే ఏ రాష్ట్రం కూడా మన దరిదాపున లేదన్నారు. బిఆర్ఎస్ వట్టిమాటలు, గాలి మాటలు చెప్పే పార్టీ కాదన్నారు. దేశ ప్రధానిగా ఉన్న మోదీ.. ఆయన సొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా ఎక్కడా అభివృద్ధి కనిపించటం లేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో ఎక్కడ కనపడని వాళ్ళు యాత్రల పేరిట తిరుగుతున్నారని మంత్రి నిరంజన్ రెడ్డి ఎద్దేవా చేశారు. సభలు పెట్టి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దమ్ముంటే కేంద్రంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో లెక్కలు చెప్పాలన్నారు. గుజరాత్ ఏర్పడి 63 ఏళ్లయినా కరెంట్ కష్టాలున్నాయన్నారు. తొమ్మిదేండ్లలో తెలంగాణలో 24 గంటల విద్యుత్ అందిస్తున్నాం. సంక్షేమం మీద అత్యధికంగా ఖర్చు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని స్పష్టం చేశారు. తెలంగాణలో అమలవుతు న్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి పథకాలు లేవని స్పష్టం చేశారు. ఆకర్షణీయ నినాదాలు ఇవ్వడంలో బీజేపీ ఫస్ట్ ఉంటుందని నిరంజన్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ సగటు ఆర్థిక వృద్ధిరేటు 11.7 శాతంగా ఉందన్నారు. భారతదేశం సగటు ఆర్థిక వృద్ధిరేటు 6 శాతమే అని తెలిపారు. తెలంగాణ జీఎస్‌డీపీలో వ్యవసాయ రంగందే 21 శాతం అని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందన్నారు. ఐటీ, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణనే ముందుందన్నారు. పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మడం ద్వారా రిజర్వేషన్లు అందక నష్టపోతున్నారని తెలిపారు. బీజేపీ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. మేకిన్ ఇండియా అట్టర్ ప్లాప్ అయిందన్నారు. ఐదు కోట్ల ఉద్యోగాల నుంచి 3 కోట్ల ఉద్యోగాలకు పడిపోయిందన్నారు. దేశంలో 45 ఏండ్లలో ఎప్పుడూ లేనంతగా నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. 15 లక్షలకు పైగా కేంద్రంలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మోదీ నియమించుకున్న ఆర్థికవేత్తలు తమ పదవులకు రాజీనామా చేస్తున్నారు. ఇప్పటికైనా మోదీ ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, వర్సిటీల కోసం బండి సంజయ్ మాట్లాడితే బాగుంటుందని మంత్రి సూచించారు. కృష్ణా నదిలో వాటా ఇవ్వాలని యాత్ర చేయాలి. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఏదైనా సాయం చేయాలని యాత్ర చేయాలి. రైతుబంధు, రైతుబీమా దేశ వ్యాప్తంగా అమలు చేయాలని యాత్ర చేయాలి. బండి సంజయ్‌కు ఉన్న అవగాహన గుండు సున్నా అని నిరంజన్ రెడ్డి తెలిపారు.

# దేశంలో శాంతికి విఘాతం కలిగిస్తున్న బిజెపి



### అభివృద్దిని ఊరూరా చాటాలన్న మంత్రి వేముల

**నిజామాబాద్,ఏప్రిల్26(సమసమాజం):** దేశంలో మతం, కులం పేరిట కొందరు చిల్లర రాజకీయాలు చేస్తున్నారంటూ బిజెపిపై మంత్రి వేములు ప్రశాంత రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ది ఇప్పుడు దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. బిజెపితో అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నదన్నారు. కొందరు మతం మీద, కొందరు కులంపేరు మీద చిల్లరమల్లర రాజకీయాలు కోసం ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశం అన్ని మతాలను, అన్నీ కులాలను సమాంతరంగా ఆదరించే గొప్ప సంస్కృతి మనదన్నారు. దేశంలో ఎన్నో పెద్ద రాష్ట్రాలున్నాయి. మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, గుజరాత్‌లు ఎప్పటి నుంచో రాష్ట్రాలుగా ఉన్నాయ్. వాటన్నింటిని అదిగమించి రాష్ట్ర తలసరి ఆదాయంలో మనం దాటిపోయాం అన్నారు. సంపద సృష్టిస్తూ పేదలకు పంచుతున్నాం. గతంలో ఎటువంటి కరెంటు గోసలుండెనో తెలుసు. ఈ రోజు బ్రహ్మాండంగా 24 గంటలు కరెంటు అన్నిరంగాలకు ఇచ్చుకుంటున్నా మంటే అది కెసిఆర్ ఘనత అని అన్నారు. ధ్యానం పండించడంలో నెంబర్ వన్ స్థాయికి ఎదుగుతున్నాం అంటే సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలే అన్నారు. ప్రభుత్వం వైద్యం, విద్యపై దృష్టి సారిస్తుంది. బిఆర్ఎస్‌కు తిరుగులేదని.. మీరిచ్చే దీవెన, మీరిచ్చే ఆశీస్సులు.. బలమే మళ్లీ కెసిఆర్ గెలవబోతున్నారని అన్నారు. దేశానికే తలమానికంగా ఉండేలా రాష్ట్రం తయారు అయ్యిందన్నారు. టిఆర్ఎస్ శ్రేణులు పార్టీ విజయాలను ముందుకు తీసుకుని వెళ్లాలని అన్నారు. కెసిఆర్ ప్రజా సంక్షేమంపై చర్చ చేయాలన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

### అంచనాకు అధికారులను పురమాయించాం
### రైతులు ఎవరూ అధైర్య పడొద్దు: మంత్రి హరీష్ రావు

**సిద్దిపేట్,ఏప్రిల్26(సమసమాజం):** రాష్ట్రంలో గత రాత్రి కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులు, వడగళ్లపై మంత్రి హరీష్‌రావు స్పందించారు. రాత్రి తీవ్రమైన వడగళ్లతో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రైతులకు ధైర్యాన్ని చెప్పే ప్రయత్నం చేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారం ఇస్తామని సీఎం కేసీఆర్ చెప్పారని తెలిపారు. దేశంలో ఎక్కడా కూడా రెండు, మూడు వేలకంటే ఎక్కువ ఇవ్వడం లేదని, వేల కోట్లు ఖర్చు పెట్టి కరెంట్ రైతులకు అందించామని చెప్పుకొచ్చారు. ఒక్క సిద్దిపేటలోనే మొదటి దశలో 35 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను మంత్రి హరీష్ రావు పరిశీలించారు. నాంచారుపల్లి, బక్రిచెప్యాల, పొన్నాల, ఏన్సాన్ పల్లి, తడ్కపల్లి, వెంకటాపూర్, బుస్సాపూర్, ఇర్కోడ్, తొర్నాల, దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని తిమ్మాపూర్, పెద్దగుండవెల్లి, దుంపలపల్లి, దుబ్బాకలో వడగండ్ల వాన పడింది. ఈ ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తో పాటు.. దెబ్బతిన్న వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని.. మంత్రి హరీష్ రావు ధైర్యం చెప్పారు. వర్షాభావంతో నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి.. నష్టపరిహారం అందేలా చూస్తామని చెప్పారు. నష్టపోయిన ధాన్యం పంటల వివరాలు యుద్ధప్రాతిపదికన సేకరించాలని మంత్రి హరీశ్ రావు జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

# తడిసిన ధాన్యాన్ని కొర్రీలు లేకుండా కొనండి



- అధికారులను ఆదేశించిన మంత్రి జగదీశ్ రెడ్డి
- ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి

**సూర్యాపేట,ఏప్రిల్26(సమసమాజం):**వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, కొర్రీలు లేకుండా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని జిల్లా అధికారులు, మిల్లర్లను మంత్రి జగదీష్ రెడ్డి ఆదేశించారు. అకాల వర్షాలతో జరిగిన పంట నష్టం, వరి ధాన్యం కొనుగోళ్ల వేగవంతంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో మంత్రి జగదీష్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం సహించేదిలేదని స్పష్టం చేశారు. ప్రకృతి ప్రకోపంతో ధాన్యం సేకరణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వరి ధాన్యం సేకరణను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సూచించారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంట వివరాలను యుద్ధ ప్రాతిపదికన సేకరించి.. నివేదిక అందించాలని మంత్రి జగదీష్ రెడ్డి ఆదేశించారు. మూడు రోజుల్లో పూర్తి వివరాలను సేకరించి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి...అదనపు అధికారులతో పర్యవేక్షించాలని కోరారు. ఎన్నికల నేపథ్యంలో మళ్లీ ప్రతిపక్ష నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ గుండెల్లో రైతులు ఉన్నారని, వ్యవసాయానికి గౌరవం పెరిగింది ముఖ్యమంత్రి వల్లే అని చెప్పారు. తెలంగాణలో వ్యవసాయ సాగుకు అందిస్తున్న సహకారం, పథకాలు దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయడం లేదన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పండించిన ప్రతి గింజను కూడా కొంటామని స్పష్టం చేశారు.

## రైతులు చస్తుంటే రాజకీయ సభలా !

(మొదటి పేజీ తరువాయి) ప్రశ్నించారు. బాధ్యత ఉందా... ఇది ప్రభుత్వమేనా... ? అని నిలదీశారు. రైతు, యువత ఏకమై బీఆర్ఎస్‌ను బొందపెట్టే సమయం వస్తుందని రేవంత్ అన్నారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పెద్ద ఎత్తున సభ నిర్వహించనున్న విషయం తెలిసిందే. దీనిని విమర్శిస్తూ రేవంత్ ట్వీట్ చేశారు.




# శుభ్‌మన్ గిల్ అద్భుత ఫామ్

## ముంబైపై 56 పరుగలతో రికార్డు

**అహ్మదాబాద్,ఏప్రిల్26(సమసమాజం):** గుజరాత్ యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ అద్భుత ఫామ్ కొనసాగిస్తున్నాడు. మంగళవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో అర్ధ శతకం సాధించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ముఖ్యంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో అద్భుతంగా ఆడుతున్నాడు. ఈ స్టేడియంలో గిల్‌కు అటు అంతర్జాతీయ క్రికెట్‌లోనూ, ఇటు ఐపీఎల్‌లోనూ మంచి రికార్డు ఉంది. మంగళవారం ముంబైతో జరిగిన మ్యాచ్‌లో మరో ఓపెనర్ వృద్ధిమాన్ సాహా త్వరగానే ఔటైనా మరో ఎండ్‌లో శుభ్‌మన్ మాత్రం జోరు కొనసాగించాడు. 34 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 56 పరుగులు చేశాడు. ఆరో ఓవర్లో వరుసగా 4,4,6 కొట్టి జోరు ప్రారంభించాడు. ఈ ఐపీఎల్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడిన గిల్ మొత్తం 284 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో అత్యధిక పరుగుల చేసిన వారి జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు. 142 స్ట్రయిక్ రేట్‌తో గిల్ పరుగులు సాధిస్తున్నాడు. క, అహ్మదాబాద్‌లోని మోదీ స్టేడియంలో గిల్‌కు మంచి రికార్డు ఉంది. ఈ స్టేడియంలో మొత్తం గిల్ 244 ఐపీఎల్ పరుగులు చేశాడు. ఇక, అంతర్జాతీయ క్రికెట్‌కు సంబంధించి ఈ స్టేడియంలో గిల్ రికార్డు మరింత మెరుగ్గా ఉంది. ఈ ఏడాది మార్చిలో ఆస్ట్రేలియతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో గిల్ 128 పరుగులు చేసింది ఈ స్టేడియంలోనే కావడం విశేషం.




# బెంగుళూరు జట్టుకు వరుస షాక్‌లు

## కోహ్లీపై ఓ మ్యాచ్‌పై నిషేధం విధించే అవకాశం

**బెంగళూరు,ఏప్రిల్26(సమసమాజం):** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. గాయాల కారణంగా ఇప్పటికే టాప్ ప్లేయర్లు దూరం కాగా.. గాడిన పడుతున్న జట్టుకు మరో ఎదురు దెబ్బ తగిలే అవకాశం ఉంది. స్టాండ్ బై కెప్టెన్ గా వ్యవహరిస్తున్న కెప్టెన్ విరాట్ కోహ్లీ లేదా కెప్టెన్ డుప్లెసిస్ పై ఒక మ్యాచ్ నిషేధం పడే అవకాశం ఉంది. గత రెండు మ్యాచుల్లో బెంగళూరు కెప్టెన్ గా వ్యవహరించిన విరాట్ డేంజర్ జోన్ లో ఉన్నాడు. రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్ లో స్లో ఓవర్ రేట్ కారణంగా.. విరాట్ కోహ్లీకి రూ.24 లక్షల ఫైన్ విధించాడు మ్యాచ్ రిఫరీ. అయితే, డుప్లెసిస్ పై ఇప్పటికే ఓసారి ఫైన్ పడింది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం.. ఏ జట్టయినా రెండు కంటే ఎక్కువ సార్లు స్లో ఓవర్ రేట్ రిపీట్ చేస్తే కెప్టెన్ పై ఒక మ్యాచ్ నిషేధం విధిస్తారు. అయితే, తర్వాతి మ్యాచ్ లో ఆర్సీబీ ఇదే రిపీట్ చేస్తే స్టాండ్ ఇన్ కెప్టెన్ గా ఉన్న కోహ్లీపై ఒక మ్యాచ్ నిషేధం పడే అవకాశం ఉంది. లేదా డుప్లిసెస్ కెప్టెన్సీ చేసినా ఆ నిషేధం అతనికి కూడా వర్తిస్తుంది.

# వరుస ఓటముల్లో ముంబై జట్టు

## రోహిత్‌కు రెస్ట్ ఇవ్వాలన్న గవాస్కర్




**అహ్మదాబాద్,ఏప్రిల్26(సమసమాజం):** ఐపీఎల్ సీజన్ 16లో ముంబై ఇండియన్స్ టీమ్ వరుసగా ఓటమి పాలవుతుండటంతో ఆ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మకు లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ కీలక సలహా ఇచ్చారు. మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో ముంబై ఇండియన్స్ ఓటమి అనంతరం గవాస్కర్ మాట్లాడుతూ.. రోహిత్ శర్మకు కొన్ని రోజులు బ్రేక్ అవసరం అన్నారు. ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ ఆర్డర్‌లో కొన్ని మార్పులు చూడాలనుకుంటున్నా. నిజాయితీగా నేను ఇంకో మాట కూడా చెప్పదలుచుకున్నా. కొన్ని రోజులపాటు రోహిత్ శర్మ ఆట నుంచి బ్రేక్ తీసుకుంటే మంచిదని భావిస్తున్నా. ఐపీఎల్‌లో కొన్ని మ్యాచ్‌ల నుంచి బ్రేక్ తీసుకుని, ఆఖర్లో మూడు నాలుగు మ్యాచ్‌లకు తిరిగి అందుబాటులోకి వస్తే మంచిదని నా అభిప్రాయం' అని గవాస్కర్ పేర్కొన్నారు. 'ఆస్ట్రేలియాతో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ÷నైల్ మ్యాచ్‌లో భారత్ తలపడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆ మ్యాచ్‌కల్లా రోహిత్ ఫిట్‌గా ఉండటం అవసరం. కాబట్టి ఐపీఎల్‌లో కొన్ని మ్యాచ్‌ల నుంచి బ్రేక్ తీసుకుని, ఆఖర్లో తన ఫామ్‌ను తిరిగి అందిపుచ్చుకుంటే బాగుంటుంది' అని గవాస్కర్ సలహా ఇచ్చారు. మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 55 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఆదివారం రాజస్థాన్ రాయల్స్‌తో ముంబై తదుపరి మ్యాచ్ ఆడనుంది.




# ప్రేమలో పడ్డ తమన్నా

## విజయ్ వర్మతో చెట్టాపట్టాల్






తమన్నా భాటియా ఇటు దక్షిణాదిలోనూ, అటు బాలీవుడ్ లోనూ బాగా పాపులర్ నటి. ఇటీవల ఆమెకి, విజయ్ వర్మకి మధ్య ఎదో ఉందని వార్తలు, వీడియోలు అన్నీ వైరల్ అయ్యాయి. అలాగే ముద్దుపెట్టుకుని ఫోటోస్ కూడా వైరల్ అయ్యాయి. దాని మీద ఆ ఇద్దరూ ఏమీ అధికారికంగా ప్రకటించలేదు కూడా. విజయ్ వర్మ, ఆమెతో పాటు ఒక వెబ్ సిరీస్ లో కలిపి నటించాడు. అక్కడ నుండి వీళ్ళ ప్రేమ మొదలయిందండి ఒక టాక్ నడుస్తోంది. అయితే ఆమె ఈ ప్రేమ గురించి బహిరంగంగా బయటకి చెప్పటం లేదు కానీ, బహిరంగంగా విజయ్ వర్మతో మాత్రం తిరుగుతూ మన తమన్నా అందరికీ కనువిందు చేస్తోంది. అలాగే గతరాత్రి కూడా విజయ్ వర్మతో కారులో వెళుతూ, ఫోటోలు తీసుకున్న వాళ్ళకి చేతులు కూడా ఊపి మారీ వెళ్ళింది. ఇద్దరూ డిన్నర్ డేట్ కి వెళ్లారు అని మొత్తం సామాజిక మాధ్యమాల్లో అంతా కోడై కూస్తోంది. ఇది ముంబై లో జరిగింది. ఇప్పుడు తమన్నా ఎక్కువగా ముంబై లో ఉంటోంది కదా, తెలుగులో కానీ, తమిళం లో కానీ షూటింగ్ ఉంటే వస్తోంది, మళ్ళీ ముంబై వెళ్ళిపోతోంది. ఇంతకు ముందు ఎక్కువ హైదరాబాద్ లో ఉండేది.అయితే ఇక్కడ ఇంకొక విషయం ఏంటంటే, ఆ కారుని స్వయంగా విజయ్ వర్మ నడుపుకుంటూ వెళ్ళటం. ఈ ఇద్దరూ బయటకి చెప్పకపోయినా, వీళ్లిద్దరి బంధం మాత్రం చాలా బలంగా ఉందని ఒక టాక్ నడుస్తోంది. ఈ బంధం పెళ్లివరకు కూడా వెళ్లొచ్చు అని కూడా అంటున్నారు. తమన్నా తెలుగులో చిరంజీవి పక్కన 'భోళాశంకర్' సినిమాలో నటిస్తోంది.

# సంజయ్‌లీలా బన్సాలీ మాత్రమే కరెక్ట్

## ఆర్‌ఆర్‌ఆర్ హింది రీమేక్‌పై చాట్‌జిపిటి



రాజమౌళి దర్శకత్వం వహించిన 'ఆర్‌ఆర్‌ఆర్' ప్రపంచ వ్యాప్తంగా ఎంతగా పాపులర్ అయిందో తెలిసిందే. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అందుకొని తెలుగు సినిమా సత్తా చాటింది. ప్యాన్ ఇండియా స్థాయిలో విడుదలైన ఈ చిత్రాన్ని హిందీలో రీమేక్ అన్న కాన్సెప్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఒకవేళ దీన్ని రీమేక్ చేస్తే..సంజయ్ లీలా బన్సాలీ మాత్రమే సరైన దర్శకుడు అన్న సమాధానం వస్తోంది. టెక్నికల్ వరల్డ్‌లో సంచలనంగా మారిన చాట్‌జీపీటీ నుంచి 'ఆర్‌ఆర్‌ఆర్' రీమేక్ గురించి జవాబు రాబట్టే పనిలో పడ్డారు. ఈ క్రమంలో 'ఆర్‌ఆర్‌ఆర్' హిందీ రీమేక్ చేయాల్సి వస్తే ఆ చిత్రానికి దర్శకుడు ఎవరైతే బావుంటుంది.. నటీనటులెవరు? అని చాట్‌జీపీటీని ప్రశ్నించారు నెటిజన్లు. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలో బ్రిటీష్‌వారిపై పోరాడిన యోధుడిగా అల్లూరి సీతారామరాజు పాత్రలో రామ్‌చరణ్ నటన జనాల్ని కట్టిపడేసింది. బాలీవుడ్ నుంచి ఆ పాత్రకు ఒదిగిపోయే నటుడు రణ్‌వీర్‌సింగ్ లేదా సిద్ధార్థ్ మల్హోత్ర కరెక్ట్‌గా సరిపోతారని ఛాట్‌జీపీటీ చెప్పింది. బ్రిటిష్ గవర్నర్ చెర నుంచి మల్లినని కాపాడిన కొమురం భీమ్ పాత్రలో ఎన్టీఆర్ నటన ప్రేక్షకుల మదిని దోచింది. ఆ పాత్రకు చాట్‌జీపీటీ.. విక్కీ కౌశల్ , రాజ్‌కుమార్ రావు పర్ఫెక్ట్‌గా సూటవుతారని సూచించింది. అలియాభట్ పోషించిన సీత పాత్రకు హిందీ వెర్షన్‌లో శ్రద్ధా కపూర్, కృతిసనన్ నప్పుతారని చాట్‌బాట్ జబాబిచ్చింది. అజయ్ దేవగణ్ పాత్రకు సంజయ్ దత్, అనిల్ కపూర్, శ్రియ స్థానంలో దీపికా పడుకోన్ పేర్లను వినిపించింది కెప్టెన్ ఆఫ్ ద షిప్ ఎవరంటే.. రాజమౌళిలా ఆ సినిమాకు న్యాయం చేయాలంటే సంజయ్‌లీలా భన్సాలీ పేరు సూచించింది.

# అజయ్‌భూపతి డైరెక్షన్‌లో మంగళవారం

## ప్రధాన పాత్రలో పాయల్ రాజ్‌పూత్



టాలీవుడ్ డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్న సినిమా 'మంగళవారం'... తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రూపొందుతున్నది. పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో నటిస్తున్నట్టు తాజాగా ప్రకటించారు మేకర్స్. దీనికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల చేశారు. 'ఆర్‌ఎక్స్ 100'తో అజయ్ భూపతి దర్శకుడిగా పరిచయం అయ్యారు. హీరోయిన్ గా తెలుగులో పాయల్ రాజ్‌పుత్ తొలి చిత్రమది. తెలుగు తెరకు ఆమెను కథానాయికగా పరిచయం చేశారు అజయ్. ఆ సినిమా తర్వాత అజయ్ భూపతి, పాయల్ రాజ్‌పుత్ కాంబోలో వస్తున్న చిత్రం కావడంతో ఆసక్తి నెలకొంది. 'మంగళవారం' సినిమాలో శైలజ పాత్రలో పాయల్ రాజ్‌పుత్ నటిస్తున్నట్లు ఫస్ట్ లుక్ విడుదల సందర్భంగా మేకర్స్ తెలిపారు. పోస్టర్ లో హీరోయిన్ లుక్ చూస్తే... పాయల్ కళ్ళల్లో కన్నీటి పొర కనబడుతోంది. ఆమె వేలిపై సీతాకోక చిలుక ఉంది. జడలో మ్లలెపూలు ఉన్నాయి. అయితే, ఒంటి మీద ఒక్క నూలుపోగు కూడా లేదు. వెనుక నుంచి ఫోటో తీశారు. ఈ ఫస్ట్ లుక్ తో ఇదొక ఎమోషనల్ అండ్ బోల్డ్ మూవీ అని చెప్పవచ్చు. ఈ సందర్భంగా దర్శకుడు అజయ్ భూపతి మీడియాతో మాట్లాడారు.గ్రామీణ నేపథ్యంలో 1990వ దశకంలో సాగే కథతో తీస్తున్న చిత్రమిది. మన నేటివిటీతో కూడిన డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్. రా అండ్ రస్టిక్ గా ఉంటుంది. థియేటర్ల నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా ప్రేక్షకులకు గుర్తు ఉండేలా పాయల్ క్యారెక్టరైజేషన్ ఉంటుంది. ఇప్పటి వరకు ఇండియాలో ఎవరూ ప్రయత్నించనటువంటి కొత్త జానర్ సినిమా ఇది. ఈ సినిమాలో 30 పాత్రలు ఉన్నాయి. ప్రతి పాత్రకూ కథలో ప్రాముఖ్యం ఉంటుందని అన్నారు. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'ఆర్‌ఎక్స్ 100'లో ఇందు పాత్ర ప్రేక్షకులకు ఎలా గుర్తు ఉండిపోతుందో, ఇప్పుడీ 'మంగళవారం'లో శైలజ పాత్ర కూడా అలాగే గుర్తు ఉంటుంది. ఇప్పటికి 75 రోజులు షూటింగ్ చేశాం. ఎక్కువ శాతం నైట్ షూట్స్ ఉన్నాయి. వచ్చే నెలలో ఆఖరి షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నాం. టెక్నికల్ పరంగా సినిమా హై స్టాండర్డ్స్ లో ఉంటుంది. 'కాంతారా' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారని నిర్మాతలు చెప్పారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in